క్లుప్తంగా

వన సమారాధనలతో సోదర భావం

ఆదాయ పన్ను శాఖ జాయింట్ కమిషనర్ కోటేశ్వరమ్మ



మంగళగిరి: కార్తిక వన సమారాధనలతో సోదర భావం పెంపొందుతుందని రాష్ట్ర ఆదాయ పన్ను శాఖ జాయింట్ కమిషనర్ తిరువీధుల కోటేశ్వరమ్మ పేర్కొన్నారు. నగర పరిధిలోని పెదవడ్లపూడి తోటలో తిరువీధుల వంశీయుల ఆధ్వర్యంలో వన సమారాధన ఆదివారం నిర్వహించారు. తిరువీధుల ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న కోటేశ్వరమ్మ, శ్రీనివాసరావు దంపతులు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ఆటల పోటీలు నిర్వహించగా విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఎంఈఓ సీతారాంబాబు, శివాజీ, రమణమూర్తి, సాంబ శివరావు, వీకబసవయ్య పాల్గొన్నారు.

పథకాలపై అవగాహన కల్పించాలి

సీనియర్ సివిల్ జడ్జి నాగరాజా

మంగళగిరి: పిల్లలు, దివ్యాంగులు, మానసిక వ్యాధిగ్రస్తుల కొరకు కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెట్టిందని, పథకాలపై ఆయా వర్గాలకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి నాగరాజా కోరారు. పట్టణంలోని కోర్టు ప్రాంగణంలో పీఎల్వీ లా శిక్షణ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొన్ని వేల కోట్లు ఖర్చు చేస్తున్నాయని ఈ పథకాల అమలుకు ఆయా వర్గాల వారిని స్వయంగా కలిసి వారికి అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు లెనిన్, రాజేష్, రాజ్యలక్ష్మి, స్వరూపారాణి, పీఎల్వీ మల్లవరపు రామ్మూర్తి, దయ్యాల నరసయ్య, లోక్ అదాలత్ ఇన్‌చార్జి ఉండవల్లి సుభాషిణి పాల్గొన్నారు.

సామూహిక సత్యనారాయణ వ్రతాలు



పెదవడ్లపూడి(మంగళగిరి): నగర పరిధిలోని పెదవడ్లపూడి శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆదివారం కార్తిక పౌర్ణమి పురస్కరించుకుని సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. పెదవడ్లపూడి, రేవేంద్రపాడు ఆర్య వైశ్య సంఘాల ఆధ్వర్యంలో వన సమరాధన నిర్వహించారు. ఈ సందర్భంగా కేదారేశ్వర స్వామి వ్రతం, మహన్యాస పూర్వక రుద్ర వారాభిషేకం, శ్రీ లలిత సహస్రనామ పారాయణం నిర్వహించారు. పురోహితలు రమణ భగవాన్ వ్రతాలు నిర్వహించి పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం వితరణ చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు స్వామి చిన్న నరసింహారావు, సనిశెట్టి ప్రసాద్, కోట నరసింహారావు, వల్లంకొండ పిచ్చయ్య, కోట కాంతారావు పాల్గొన్నారు.

నేడు 'ఆడుదాం ఆంధ్ర' ర్యాలీ

మంగళగిరి: ఆడుదాం ఆంధ్రపై అవగాహన ర్యాలీ సోమవారం నిర్వహించనున్నట్లు కార్పొరేషన్ కమిషనర్ నిర్మల్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటలకు నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద నుంచి ర్యాలీ ప్రారంభమవుతుందని చెప్పారు. యువత, విద్యార్థిని, విద్యార్థులు భారీగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మంగళగిరి: విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా సోమవారం సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈఈ అక్కల సత్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3.30 వరకు కరెంట్ ఉండదని చెప్పారు. పట్టణంలోని గౌతమ బుద్ధా రోడ్డు, కోనేరు ఏరియా, ఎన్‌సీసీ రోడ్డు, హౌస్సేన్ కట్ట, భార్గవపేట ఏరియా వినియోగదారులు సహకరించాలని కోరారు.

- నగరంలోని పెదవడ్లపూడి, నూతక్కి, చిర్రావూరు, కొత్తపాలెం ప్రాంతాలలో కూడా సరఫరా సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఉండదని డీఈఈ చెప్పారు.

1200 మందికి ఉచిత వైద్య సేవలు

మంగళగిరి: నగర పరిధిలోని యర్రబాలెంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. మానవ సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో 1200 మంది రోగులకు సేవలందించారు. వివిధ రోగాలకు సంబంధించి వైద్యులు పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు చావలి ఉల్లయ్య, మానవ సేవా సంస్థ ప్రతినిధులు వంగర సురేష్ కుమార్ పాల్గొన్నారు.

రాజ్యాంగం ప్రజాస్వామ్యానికి దిక్సూచి

- ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు
- ఘనంగా భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవం



డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు

మంగళగిరి: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగంతోనే దేశంలో ప్రజాస్వామ్యం పరఢవిల్లుతోందని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు పేర్కొన్నారు. నగరంలోని ఆటోనగర్‌లోని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) కార్యాలయంలో ఆదివారం భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి ఎమ్మెల్సీ హనుమంతరావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర చేనేత విభాగం అధ్యక్షుడు గంజి చిరంజీవి, జిల్లా అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, పట్టణ కన్వీనర్ ఆకురాతి రాజేష్, పట్టణ జేసీఎస్ కన్వీనర్ ఎండీ ఫిరోజ్‌లతో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ ప్రపంచంలోని దేశాలన్నిటికల్లా భారత రాజ్యాంగం అత్యుత్తమైనదన్నారు. అంబేద్కర్ రాజ్యాంగాన్ని అనుసరిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పరిపాలన అందిస్తున్నారని కొనియాడారు.

ప్రగడ కోటయ్య సేవలు..

చేనేత పరిశ్రమ అభివృద్ధి కోసం చేనేత సూరీడు ప్రగడ కోటయ్య చేసిన సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు కొనియాడారు. నగరంలోని ఆటోనగర్‌లోని ఎమ్మెల్యే ఆర్కే కార్యాలయంలో ఆదివారం ప్రగడ కోటయ్య వర్ధంతి నిర్వహించారు.

అంబేద్కర్ చిరస్మరణీయుడు

మంగళగిరి: నగరంలోని అంబేద్కర్ విగ్రహం సెంటర్‌లో డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్‌కు భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎస్సీ ఎస్టీ రైట్స్ యాక్ట్స్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఆదివారం నివాళులర్పించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కారుమంచి రామారావు పాల్గొన్నారు.



తాడికొండ నార్త్ పాఠశాలలో ముసాయిదా కమిటీకి సభ్యుల వేషధారణలో చిన్నారులు

ఘనంగా రాజ్యాంగ ఆమోద దినోత్సవం

తాడికొండ: రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని పురస్కరించుకొని తాడికొండ నార్త్ పాఠశాలలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాజ్యాంగ ముసాయిదా కమిటీకి రాజ్యాంగం అందజేసే ప్రక్రియ దృశ్యాలను చిన్నారులు ప్రదర్శించారు. తాడికొండ సర్పంచి తోకల సరోజినీ హాజరై మాట్లాడుతూ బహుజనుల హక్కుల కోసం రాజ్యాంగంలో సమాన ఫలాలు అందించిన మహనీయుడు డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ అని కొనియాడారు. తొలుత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉప సర్పంచి ఉయ్యూరు వెంకటరెడ్డి, హెచ్ఎం, మట్టుకొయ్య ప్రమీల పాల్గొన్నారు.

– తాడికొండ శాఖ గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని పురస్కరించుకుని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజ్యాంగ పీఠిక, దాని భావజాలం, నిబద్ధతను గ్రంథాలయాధికారి జి.శ్రీనివాసరావు వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది ఏ నాగమల్లేశ్వరి, రైతు సంఘం నాయకులు చింతల భాస్కరరావు, ఏమేశ్వరరావు, వై.నరసింహారావు, కె.శ్రీనివాసరావు, జానీ, రంగారావు, శ్రీ శైలం పాల్గొన్నారు.



డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పిస్తున్న కత్తెర సురేష్ కుమార్, బత్తుల బ్రహ్మానందరెడ్డి

అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రభుత్వం కృషి

- నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్,
- ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి

తాడికొండ: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయ సాధనకు వైఎస్సార్ సీపీ అన్ని విధాలా కృషి చేస్తుందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కత్తెర సురేష్ కుమార్, ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు. రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని గుంటూరు భారత్‌పేటలోని నియోజకవర్గ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. తొలుత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ 1949 నవంబర్ 26న భారత రాజ్యాంగాన్ని పార్లమెంటులో ఆమోదించడం జరిగిందని, పేద, బడుగు, బలహీన వర్గాలతో పాటు మహిళలకు సమాన హక్కులు కల్పిస్తూ బాబా సాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం అన్ని వర్గాలకు సమన్యాయం జరిగిందన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలను ఏపీలో సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కొనసాగిస్తున్నారని, అందులో భాగంగానే దేశంలో ఏ రాష్ట్రంలో అమలు కాని విధంగా ఏపీలో సంక్షేమ పథకాల అమలులో అన్ని వర్గాలకు అర్హతే ప్రామాణికంగా పనిచేస్తున్నట్లు వివరించారు. రాజకీయాలతో పాటు, సీట్ల కేటాయింపు, నామినేటెడ్ పదవులు, కాంట్రాక్టులు, కార్పొరేషన్‌ల ఏర్పాటులో 50 శాతానికి పైగా ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాలకు పెద్దపీట వేసిన సీఎం వైఎస్ జగన్ సామాజిక న్యాయానికి పెద్దపీట వేశాడని కొనియాడారు. వలంటీర్లపై జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చేస్తున్న వ్యాఖ్యలను ఈ సందర్భంగా ఖండించారు. చంద్రబాబు ఏజెంటుగా ప్యాకేజీ స్టార్ పవన్ కళ్యాణ్ ఏపీలో కోవర్టు రాజకీయాలు చేస్తూ టీడీపీ పల్లకి మోస్తున్నారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో పార్టీ తాడికొండ, మేడికొండూరు మండల అధ్యక్షులు బొర్రా వెంకటేశ్వరరెడ్డి, తాళ్ళూరి వంశీ, నాయకులు కొప్పుల శేషగిరిరావు, తాళ్ల శ్రీనివాసరెడ్డి, ఎస్.సందీప్, శివారెడ్డి, రమణారెడ్డి, వెంకటస్వామి, డీజే శ్రీను, సీహెచ్ పూర్ణచంద్రరావు, ఆర్.జోజి, షేక్ అబ్బాస్, బాజీ ఎ.సురేష్, ఎస్.రాజేంద్ర పాల్గొన్నారు.

శివాలయానికి పోటెత్తిన భక్తులు



శివాలయంలో కార్తిక దీపాలు వెలిగిస్తున్న భక్తులు



పుట్ట మట్టితో చేసిన రామసేతు అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్న మల్లేశ్వరస్వామి

మంగళగిరి: నగరంలోని గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానం(శివాలయం) ఆదివారం రాత్రి భక్తులతో కిటకిటలాడింది. కార్తిక పౌర్ణమి కావడంతో మహిళలు కుటుంబ సభ్యులతో కలసి ఆలయానికి విచ్చేసి కార్తిక దీపాలను వెలిగించి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. నగరంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలి రావడంతో ఆలయం భక్తులతో రద్దీగా మారింది. ఆలయ ఈఓ ఏ రామకోటిరెడ్డి, ట్రస్ట్‌బోర్డు చైరపర్సన్ నేరెళ్ల లక్ష్మీపార్వతి, ట్రస్ట్ బోర్డు సభ్యులు అద్దంకి వెంకటేశ్వర్లు, కొల్లి ముసలా రెడ్డి, కొల్లి బాబూరావులతో పలువురు ఆలయంలో ఏర్పాట్లను పర్యవేక్షించగా ఆలయ ప్రధాన అర్చకులు దేవరపల్లి మహేష్ శర్మ పూజలు చేశారు.

ఆలయాల్లో కార్తిక దీపారాధనలు

ఫిరంగిపురం: మండలంలోని పలు ఆలయాల్లో కార్తిక పౌర్ణమిని పురస్కరించుకొని భక్తులు విశేష దీపారాధనలు చేశారు. మండల కేంద్రంలోని కాళహస్తీస్వరస్వామి ఆలయం, వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం, నగరేశ్వరస్వామి ఆలయం, రుక్మిణీ వేణుగోపాలస్వామి ఆలయాల్లో అర్చకులు స్వామివార్లకు విశేష అర్చనలు, పూజలు చేశారు. నుదురుపాడులోని అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వర స్వామికి, వేములూరిపాడులోని జలపాలేశ్వరస్వామికి, అమీనాబాద్‌లోని మూలాంకురేశ్వరి ఆలయం, రేపూడిలోని కోదండరామాలయంలో భక్తులు ప్రదక్షిణలు చేసి ఉసిరి, మారేడు చెట్లు కింద దీపారాధనలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

కాలం కవుల చేతుల్లో బందీ

డొక్కా మాణిక్యవరప్రసాద్



పుస్తకాన్ని ఆవిష్కరించిన మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ తదితరులు

పాత గుంటూరు: కాలాన్ని శాసించగల శక్తి కవులకే ఉందని, కాలం కవుల చేతిలో మాత్రమే బందీగా ఉంటుందని మాజీ మంత్రి, జాషువా కళాపీఠం అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ అన్నారు. బ్రాడీపేటలోని కొరటాల భవన్‌లో ఆదివారం బాపు- రమణ- బాలు కళాపీఠం- నవ్యాంధ్ర రచయితల సంఘం జిల్లాశాఖ ఆధ్వర్యంలో డాక్టర్ రమణ యశస్వి రచించిన 'యశస్వీయ సప్తపదులు' పుస్తకావిష్కరణ, కవిమిత్రుల సంగమం- కవి సమ్మేళనం నిర్వహించారు. డొక్కా మాట్లాడుతూ కాలాన్ని తన గుప్పిటలోకి తెచ్చుకుని వైద్యుడిగా, సాహితీవేత్తగా రెండు పాత్రలను ఏకకాలంలో పోషిస్తున్న విశిష్ట వ్యక్తి డాక్టర్ రమణ యశస్వి అన్నారు. లఘు కవితా ప్రక్రియల ఉద్యమకారుడు, ప్రసిద్ధ సాహితీవేత్త డాక్టర్ రావి రంగారావు 'సప్తపదులు' పుస్తకాన్ని ఆవిష్కరించారు. రంగారావు మాట్లాడుతూ ఆధునిక సాహిత్యంలో మినీ కవితా ప్రక్రియలపాత్ర కీలకమైందన్నారు. సభకు అధ్యక్షత వహించిన ప్రొఫెసర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు మాట్లాడుతూ నేడు తెలుగు సాహిత్యంలో అనేక ప్రక్రియలు, పరిణామాలు వస్తున్నాయని చెప్పారు. ఇవి చాలా అవసరమని వివరించారు. సాహిత్యంలో మార్పు అనివార్యం, మంచి మార్పు సాహిత్యాన్ని పదికాలాలు సజీవంగా ఉంచుతుందని అభిప్రాయపడ్డారు. ప్రసిద్ధ కవి కోసూరి రవికుమార్ పుస్తకాన్ని సమీక్షించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం సభ్యులు డాక్టర్ కత్తి వెంకటేశ్వర్లు, సాహితీవేత్తలు డాక్టర్ పీవీ సుబ్బారావు, వైహెచ్‌కే మోహన్‌రావు, నవ్యాంధ్ర రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి కలిమిశ్రీ, గుంటూరు జిల్లా శాఖ అధ్యక్షులు డాక్టర్ తూములూరి రాజేంద్రప్రసాద్ మాట్లాడారు. పుస్తక రచయిత డాక్టర్ రమణ యశస్వి నూతన కవితా ప్రక్రియ ఉద్దేశాన్ని తెలిపారు. అనంతరం బి.జనార్ధనరెడ్డి నిర్వహించిన కవి సమ్మేళనంలో మూడు జిల్లాలకు చెందిన కవులు తమ కవితల్ని వినిపించారు. చిలకలూరిపేటకు చెందిన పి.వి.రమణకుమార్ చదివిన కవితను ఉత్తమ కవితగా ఎంపిక చేసి నగదు బహుమతి, సర్టిఫికెట్, శాలువతో అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ సత్కరించారు. సయ్యద్ జానీబాషా, బండికల్లు జమదగ్ని నిర్వహించారు.

టెన్నిస్ పోటీల్లో మెడల్ సాధించిన డాక్టర్ వై.షేక్‌కు సత్కారం



డాక్టర్ వై.షేక్‌ను సత్కరిస్తున్న ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి, మేయర్ కావటి, మద్దాళి గిరి

లక్ష్మీపురం: గుంటూరు ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ వై.షేక్ ఇటీవల విజయవాడ ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నేషనల్ డాక్టర్స్ ఒలంపియాడ్- 2023 టెన్నిస్ డబుల్స్‌లో రన్నర్స్‌గా సిల్వర్ మెడల్ సాధించడం అభినందనీయం అని ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి అన్నారు. స్థానిక పట్టాభిపురంలోని మౌలానా అబుల్ కలాం ఆజాద్ షాదిఖానాలో ఆదివారం డాక్టర్ వై.షేక్‌కు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ వై.షేక్ అన్ని వర్గాల వారికి ఎంతో సహాయం చేసే వ్యక్తిత్వం కలిగిన వ్యక్తి అన్నారు. అనంతరం డాక్టర్ వై.షేక్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, డెప్యూటీ మేయర్ షేక్ సజీల, వక్ఫ్‌బోర్డు చైర్మన్ జిలాని, జిల్లా గ్రంథాలయ చైర్మన్ దేవానంద్, కార్పొరేటర్లు రోషన్, విశ్రాంత ఎక్సైజ్ కమిషనర్ అహ్మద్ షరీఫ్ పాల్గొన్నారు.

భవానీమాతకు విశేష పూజలు

ఫిరంగిపురం: మండలంలోని వేములూరిపాడులోని జలపాలేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం భవానీమాలధారులు విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఉమాపతి శాస్త్రి భవానీ పీఠం వద్ద మండపారాధన, విశ్వక్సేనపూజ, అఖండ దీపారాధన, కలశ స్థాపనలు చేసి భవానీమాతకు అష్టోత్తర, సహస్ర నామ కుంకుమపూజలు చేశారు. భవానీ మాలదారులు పలువురు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. వారికి తీర్థప్రసాదాలు అందజేశారు.

వైభవంగా గంగానమ్మ కొలుపులు

తెనాలి: పట్టణ గంగానమ్మపేటలోని గంగానమ్మ గుడిలో ఆదివారం అమ్మవారి కొలుపులు వైభవంగా జరిగాయి. కొలుపుల సందర్భంగా ఉదయం నుంచి ప్రత్యేక పూజలను చేశారు. పట్టణ, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు తెల్లవారుజామున 5 గంటల్నుంచి పెద్దసంఖ్యలో తరలివచ్చారు. క్యూ లైనులో నిలబడి గంగమ్మ తల్లిని దర్శించుకున్నారు. మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు మహిళలు పొంగళ్ల నైవేద్యం సమర్పించారు. కొన్ని ప్రాంతాల్నుంచి భక్తులు ప్రత్యేకంగా అలంకరించిన ప్రభలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. పూజలు చేశారు. సాయంత్రం వరకు కొలుపుల వేడుకలు కొనసాగాయి.

గుండె ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి

లక్ష్మీపురం: జీవన విధానం, అనారోగ్యకరమైన అలవాట్లు దీర్ఘకాలంలో గుండె ఆరోగ్యాన్ని దెబ్బ తీస్తాయని సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ హరిత అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఆరోగ్య సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గుండె జబ్బుల గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. శరీరంలో అన్ని అవయవాలలో గుండె ప్రధానమైనదని, పెద్ద వయస్సులో వచ్చే గుండె జబ్బులు కొన్ని సందర్భాల్లో వారి మానసిక అనారోగ్యం వల్ల కూడా సంభవించే అవకాశం ఉందన్నారు. మనం తీసుకునే ఆహారంలో పీచు పదార్థం ఎక్కువగా ఉండేలా చూసుకోవాలన్నారు. గుండెకు సంబంధించిన రక్తనాళాలలో పూడికలు వాతం ఎక్కువగా ఉంటే బైపాస్ సర్జరీ చేస్తారని, తక్కువగా ఉంటే మందులతో చికిత్స చేయవచ్చన్నారు. ఆయిల్ విషయంలో మనం చాలా జాగ్రత్తలు తీసుకోవాలని ఆలీవ్‌ఆయిల్ శ్రేష్టమైనదని సూచించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు డాక్టర్ హరితను ఘనంగా సత్కరించారు.

బ్యాడ్మింటన్ విజేతలకు బహుమతులు



40+ డబుల్స్ పోటీలో విజేతలతో నిర్వాహకులు

గుంటూరు వెస్ట్(క్రీడలు): వేణు బ్యాడ్మింటన్ అకాడమీలో ఆదివారం నిర్వహించిన 40+ డబుల్స్ పోటీలో విజేతగా డాక్టర్ రవికుమార్, మిత్ర, రన్నర్స్‌గా ఎస్.సుబ్బారావు, ఏసోబు, తృతీయ స్థానంలో వెంకట కృష్ణ, రాజు నిలిచినట్లు కోచ్ వేణు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విజేతలకు కళ్లం హరనాథ్‌రెడ్డి లిమిటెడ్ ఎండీ పి.వేణు గోపాల్ రెడ్డి, శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్ పార్టనర్ మహేష బాబు బహుమతులు అందజేశారు.

మంచి పుస్తకాల ఆవిష్కరణ



మంచి పుస్తకాల ఆవిష్కరణలో ఓబులేసు, శివశంకర్, లక్ష్మీనారాయణ తదితరులు

నగరంపాలెం: సాహిత్య ప్రమేయం లేని సమాజం అనారోగ్యానికి గురవుతుందని అరసం నేత, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు అన్నారు. బృందావన్‌గార్డెన్స్ అన్నమయ్య గ్రంథాలయంలో అభ్యుదయ రచయితల సంఘం (అరసం) ఆధ్వర్యంలో ఆదివారం మంచి పుస్తకాల ఆవిష్కరణ సభ నిర్వహించారు. పులుపుల వెంకట శివయ్య గేయాలు- వ్యాసాలు పుస్తకాన్ని ఓబులేసు, తాపీ ధర్మరావు- జీవితం- రచనలను సాహితీవేత్త డాక్టర్ పాపినేని శివశంకర్, కుందుర్తి కవితా స్రవంతి పుస్తకాలను అరసం రాష్ట్ర కార్యదర్శులు కె.శరత్ చంద్ర, జ్యోతిశ్రీ ఆవిష్కరించారు. సాహితీవేత్త డాక్టర్ పాపినేని శివశంకర్ మాట్లాడుతూ ప్రాచీన, ఆధునిక సాహిత్యాలకు వారధి తాపీ ధర్మరావు అన్నారు. నేటితరం సాహిత్యకారులు విధిగా ప్రాచీన సాహిత్యాన్ని కూడా అధ్యాయనం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ నేటి తరానికి అభ్యుదయ సాహిత్యాన్ని చేరువ చేసేందుకు ప్రచురణలు కొనసాగిస్తూ, డిజిటల్ ఛానెల్ ద్వారా కూడా సాహిత్య కార్యకలపాలను సమాజానికి చేరువ చేస్తున్నామని అన్నారు. సభకు ఏపీ అరసం సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరి శివప్రసాద్ అధ్యక్షత వహించగా మాట్లాడారు. అనంతరం ఉమ్మడి జిల్లా అరసం కార్యవర్గాన్ని ప్రకటించగా, గౌరవాధ్యక్షునిగా కారసాని రామకృష్ణారెడ్డి, అధ్యక్షుడిగా చెరుకుమల్లి సింగా, ఉపాధ్యక్షులుగా డాక్టర్ గౌట్టిముక్కల స్వర్ణలత, గొలి సీతారామయ్య, కనపర్తి బెనహర్ నియమితులయ్యారు.

పూర్వవిద్యార్థుల అపూర్వ సమ్మేళనం



రామకృష్ణ విద్యాలయం 1977 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సీతానగరం రామకృష్ణ విద్యాలయం పూర్వ విద్యార్థుల సమ్మేళనం, గురు సత్కార కార్యక్రమం శ్రీపాద హోటల్‌లో ఆదివారం జరిగింది. రామకృష్ణ విద్యాలయంలో 1977 సంవత్సరంలో 10వ తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు నిర్వహించిన సమ్మేళనంలో ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. ఆటపాటలతో రోజంతా ఉత్సాహంగా గడిపారు. తమకు విద్యా బోధన చేసిన గురువులను సత్కరించారు.

గుండిమెడలో మద్యం బాటిళ్లు స్వాధీనం

మంగళగిరి: నగర పరిధిలోని స్పెషల్ బ్రాంచి పోలీసులు ఆదివారం తనిఖీలు నిర్వహించారు. వివరాలు.. గుండిమెడలో అక్రమ మద్యం విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు తనిఖీ చేసి, నిబంధనలకు విరుద్ధంగా నిల్వ ఉంచిన 11 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎమ్మెల్యే ఆర్కే ఆర్థిక సాయం

మంగళగిరి: దుగ్గిరాల మండలంలోని కంఠంరాజు కొండూరులో మృతి చెందిన మృతురాలు కుటుంబానికి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) ఆర్థిక సహాయం చేశారు. కంఠంరాజు కొండూరు గ్రామానికి చెందిన యల్లంపల్లి కోటేశ్వరమ్మ అనారోగ్యకారణంతో ఆదివారం మృతి చెందింది. మృతురాలు కోటేశ్వరమ్మ మృతి వార్త తెలుసుకున్న ఎమ్మెల్యే ఆర్కే రూ.10వేల ఆర్థిక సహాయం చేయగా ఎంపీటీసీ సభ్యుడు షేక్ సుభాని, రావూరి రామచంద్రయ్య, గోపి, కావూరి అశోక్, మనోజ్, ఆలూరి ఏలియా కోటేశ్వరమ్మ నివాసానికి చేరుకుని ఆమె కుటుంబ సభ్యులకు నగదు అందజేశారు.